

# చుట్టాలొస్తే బాగుణ్ణు

ఆ విశాలమైన మైదానంలో.. నా తోటి మిత్రుల రాకకోసం నిరీక్షిస్తూ నిలబడ్డాను. ఎపుడూ నాకంటే ముందుగా వచ్చే పైడిరాజు సైతం ఇంకా రాలేదు.

నా చేయి వుండబట్టక అప్పటికి పదిసార్లు బౌలింగ్ ప్రాక్టీస్ చేసి వుంటా... కాని ఒంటరిగా ఎంతకని?

పిట్టలరుపులు తప్ప మరేం వినబడని మా వూరవతల గ్రౌండు. నాకు మాత్రం చదువు సంధ్యల్లేవా... ఇప్పటికే క్రికెట్ వూసెత్తితే చీపురు తిరగవేసే అమ్మకు సైతం లెక్కల ప్రైవేటుకని మస్కా కొట్టి ఇట్లా వచ్చేసా... అసహనంతో చాలా సమయం గడిపాను. దూరంగా పైడిరాజు కనిపించాడు. రావటం తోటే చిరాకు పడ్డాను.

"నీకేం పోయిందిరా? మా యింటి నిండా చుట్టాలే... వారందరినీ విడిపించుకుని వచ్చేసరికి ఎంత కష్టమైపోయిందో?" వుసూరు మన్నాడు పైడిరాజు.

"ఏమిటి చుట్టాలొచ్చారా!" నేనెందుకంత అచ్చెరువొందానో తెలీనివాడు ఎంతగానో ఆశ్చర్యపోయాడు.

"అయితే ఇంతకీ ఎంత కొట్టేసావేమి? చుట్టాల్దగ్గర... మన డోనేషన్‌కయినా సంపాయించావా" ఉత్సుకత ప్రదర్శించాను.

"చుట్టాలదగ్గరే సంపాయించాలేంటి! నాన్న నడిగి తెచ్చాను..." అని ఐదునోటు నాచేతిలో వుంచాడు.

అందరి దగ్గర నేనే కలెక్టు చేస్తున్నాను. మా అందరికి నేనే కెప్టెన్‌ని... అల్లుల్లో మల్లు పెద్ద సామెతలా నేనేదో ఆటలో వూడబొడుస్తానని నన్ను ఎన్నుకున్నారు.

ఈ కారణంగానే ప్రెసిడెంటు సోమరాజు కొడుకు గణపతికి నేనంటే అక్కసు. రెండు మూడు సార్లు గ్రౌండులో పట్లు పట్టాం. వాడికి డబ్బుందనే అహంకారం అంతాయింతా కాదు. నాకు డబ్బులేదని చాలాసార్లు గేలి చేసాడు కూడా....

"ఒరే... రాంబాబు, రవి, లక్ష్మణ వీళ్ళెవరూ రావటం లేదు. దొంగెత్తులేవో వేస్తున్నారు. ఎవడికి పట్టింది బాధ. పద మనమూ పోదాం..." మంచి వుద్వేగంతో గ్రౌండంతా దున్నిపారేయాలన్న ఎంతో ఆవేశంతో అడుగిడిన నా మనస్సు చప్పబడిపోయింది.

"అన్నట్టు నీ డొనేషనేది? అందరికీ కెప్టెన్‌వి... ముందర ఇవ్వాలికదా..." పైడిరాజు ప్రశ్న సబువుగా తోచింది.

జవాబు చెప్పకుండా నాన్చాను. పిదప ఎవరి తోవన వాళ్ళం పోయాం. నా హృదయం అనిశ్చితంగా వుంది. క్రికెటంటే నాకెంత ప్రేమో, అభిమానమో వర్ణించలేను. ఆదివారం ఎపుడు వస్తుందా 'మేచ్' వేసుకుందామానిపిస్తుంది. మేమేమో భారత జట్టులా ఫీలైపోయి పొరుగూరు వాళ్ళని వెస్టిండీసులా చూస్తుంటాం.

అన్నట్లు ఈ మధ్య మా బాల్ పాతదయిపోయింది. బ్యాట్ అరిగి, పెచ్చులూడుతోంది. కొందామనుకుంటున్నాం... అందుకే ఈ చందాలు....

అమ్మకి క్రికెట్ అంటే పరమ ద్వేషం... ఆ ఆటవల్లే నే చెడుతున్నానంట.. ఎపుడూ ఫస్ట్ మార్కులు సంపాయించే నేను మొన్న హాఫ్‌యియర్లీ పరీక్షలలో తక్కువ మార్కులు తెచ్చుకున్నందుకు క్రికెట్‌ని అటేడుతరాలు.. ఇటేడుతరాలు తూర్పారబట్టింది.

నాన్న మెత్తనిపులి... నోరు చేసుకోకున్నా... కోపంతో కళ్ళు అగ్ని గోళాల్లా చేసి నావైపు చూసినపుడు నా గుండెల్లో రాయి పడ్డట్టువుతుంది.

నోరు విడిచి అడిగినా 'పాపం' అని కూడా తలవరు. సినిమాకని అడిగితే హాలుకి పంపదు. ఆదివారం పూట తన తోటీ, పొరుగింటి పుల్లమ్మ గారింటికో, ఎదురింటి ఎల్లమ్మ గారింటికో లాక్కుపోతుంది. అమ్మేమో ఆడాళ్ళ మధ్య దూరిపోతుంది. జాగా దొరక్క నేనేమో బయట నిల్చొని కిటికీలోంచి చూడాల్సి వస్తుంది. సినిమా కంటే నాకు

క్రికెట్ మేచ్ చూడాలన్న వుబలాటం ఎక్కువ... కాని, ఆ నిముషం నా హృదయంలో బలంగా నాటుకున్న వాంఛని అణగద్రొక్కేస్తుంది అమ్మ.

అందరిలా టి.వి. కొనే స్తోమత మాకు లేదాయె.

గతం వర్తమానాల నడుమ వూగిసలాడుతోంది నా ఎద. పైడిరాజు ఇంటికి ఎంచక్కా చుట్టాలొచ్చార్ట... కాని వాడికి వాళ్ళ ఖాతరు లేదు. మా ఇంటికి ఎంత త్వరగా చుట్టాలొస్తారాని నాకుంది. చాలా కాలమైంది చుట్టాలుదిగి. రెండ్నెల్ల క్రితం కాబోలు అరుకు నుండి ఒకాయన వచ్చారు. నాకు వరసకి బాబాయి ఔతార్ట. ఏదో పనిమీద రెండు రోజులున్నారు. ఆయన నన్ను దగ్గరగా చేర్చుకుని రెండు రూపాయలు చేతిలో పెట్టాడు.

అదేంటోకాని అమ్మకి చుట్టాలంటే తెగమంట. ఎంత త్వరగా వెళ్ళిపోతారాని చూస్తుంది.

"ఈ తుమ్మమొద్దు ఇంకా ఎంతకాలం తిష్ట వేస్తాడు" అంది ఓసారి ఎవరో వస్తే.. నాన్నతో..

నిజానికి నాకెంత బాధనిపించిందో... పాపం... అందరితో కలసిపోయి... సర్దాగా మాట్లాడే ఆయన అమ్మ దృష్టిలో తుమ్మమొద్దా ! నాక్కోపం వచ్చింది. నాన్న ప్రత్యక్షంగా వ్యతిరేకించపోయినా ఒక్కోమనిషిపట్ల ఒక్కోలా ప్రవర్తిస్తుంటారు.

ఇంటికి చేరేదాకా నేనాలోచిస్తూ నడుస్తున్నాను. నా చేతిలో వున్న స్టంప్స్, బ్యాటుని చూస్తే అమ్మ అగ్గిమీద గుగ్గిలం అవుతుందని చెప్పి, పెరట్లో వసారాలో దాచాను.

వీధి గుమ్మంలో చాలా చెప్పులు....

చుట్టాలొచ్చారా? ఎంత అదృష్టం... గబ గబలోనికి నడిచాను. క్రింద పరచిన దుప్పటిపై అందరూ కూర్చున్నారు. అంతలేసి కళ్ళనిండా ఎంచక్కా ఇంత కాటుక.. నుదుట్న ఎఱ్ఱటి దోసగింజ బొట్టు.. రోజూ కంటే బాగా ముస్తాబయి మధ్యన కూర్చుని వుంది అక్క

అంతా కాఫీలు చప్పరిస్తున్నారు. అక్కవైపే అందరిచూపులూ.. ఆ చూపులకు అక్కకి దిష్టి తగల్దు కదా...

తలుపువారగా నిల్చున్న నన్ను రెక్కపట్టి లోనికి ఈడ్చుకెళ్ళింది అమ్మ. "దొంగ వెధవా! ఎక్కడికి తగలడ్డావ్... అక్కని చూడ్డానికి వచ్చారు. ఆ పాడు మొహం కడుక్కురా... వెళ్ళు..." అని పెరట్లోకి తోసింది.

అసలు... అక్కను చూడ్డానికి రావటమేంటి? అదీ ఎక్కడ నుంచో.... బోలెడు మంది రోజూ అక్కను చూస్తూనే వుంటారే... ఇంతకీ అక్కను చూడ్డానికొస్తే నేనెందుకూ ముస్తాబవటం? బయటకి వచ్చాకా వక్కపొడి తెమ్మని డబ్బులు ఇచ్చింది అమ్మ. వెళ్ళి తెచ్చి పళ్ళెంలో పోసి అందరికీ అందించాను.

నేను వారందరి వైపు ఎంతో ఆశతో చూస్తున్నాను. అందులో ఒకాయన "కుర్రాడు చాలా హుషారుగా వున్నాడే? ఏం చదువుతున్నావు బాబూ!" నవ్వి ప్రశ్నించాడు.

చెప్పాను.

"గుడ్...ఇంకా బాగా చదువుకో... ఇంద ఏదయినా ఖర్చు పెట్టుకో..." అని అయిదు నోటు అందించారు.

నేను తీసుకోవటానికి చేయి చాపుతుంటే... "తప్పు బాబూ.. వారిస్తే మాత్రం అలా తీసుకోవటమేనా!" అడ్డంపడింది అమ్మ.

అమ్మ మీద బోలెడు కోపం వచ్చేసింది.

ఆయన యివ్వాలని రెండు సార్లు ప్రయత్నించినా.. అమ్మ నన్ను దూరంగా లాగేసింది. నాకేడుపు వచ్చేసినంత పనయ్యింది.

అమ్మెపుడూ ఇంతే... తనివ్వదూ... ఇవ్వనివ్వదూ...

ఆరోజు అన్నం సయించలేదు. మళ్ళా చుట్టాలెపుడొస్తారో... వచ్చినా అమ్మ ఇప్పటిలాగే అడ్డుపడితే?

ఓవైపు క్రికెట్ చందా కెప్టెనే ఇవ్వకుంటే ఎట్లా? అని అడిగి చంపేస్తున్నారు. అబద్ధాలాడి నాన్నదగ్గర డబ్బు గుంజటం చాతకాదు నాకు. ప్చ్...!!!

★★★

ఆ రోజు ఉదయం... తొమ్మిదిన్నరయింది. తలుపు చప్పుడయింది. స్కూలు పుస్తకాలు సర్దుకుంటూన్న నేను లేచి వెళ్ళి తెరిచాను. ఇదివరలోనే చూడని మొహం....

ఎవరో ఏమిటో అడిగే లోపల... ఆ భారీ ఖాయం లోనికి దబాయింపుగా వచ్చి.. "మీ నాన్నేడ్రా... ఇట్లా రమ్మను.." అని అంటుంటే నాక్కోపం రావాల్సింది పోయి, నా ఆశ ఓటుంది కాబట్టి నవ్వు మొహం పెట్టాను... అందులో 'ఏడ్రా'ని పిలుస్తుంటే నాన్నకీ... ఆయనకీ మంచి దోస్తనిపించింది.

వెళ్ళి నాన్నను తీసుకువచ్చాను.

నాన్న ఆయన్ను చూస్తూనే... "ఓరోరి భోగేశూ... నువ్వట్రా.. ఎంతకాలమైందిరా

నిన్ను చూసి.." అని కరవుతీరా కౌగిలించుకున్నారు.

వారి స్నేహం ఏపాటిదో ఆ క్షణమే బోధపడింది.

ఆ విషయం... ఈ విషయం మాట్లాడుతుంటే అమ్మ కాఫీ పట్టుకువచ్చింది.

నా మనసు పసందుగా మారింది. ఆయన నాల్గు రోజులుండాలని వచ్చినట్లు మాటల్లో తెలిసింది. ఆ లోగానే అమ్మ నాన్నని... "ఓసారిలా రండి..." పిలిచింది.

"మీ 'ఘటం' ఎన్నాళ్లమకాం" కర్కశంగా ప్రశ్నించింది అమ్మ.

"ఏదో... మండలాఫీసులో పనట.. నాల్గు రోజుల పాటు... పాపం చాలా కాలానిక్కలిసాడు.." అమ్మని వేడుకోవటం నవ్వు తెప్పించింది.

"అయినా అడ్డమైనా వాళ్ళు వస్తుంటే ఇల్లు గుల్లవదూ.." అమ్మ.

"మొహం మీద పొమ్మని అనలేం కదా..." నాన్న.

"అందుకే పొగపెట్టి పొమ్మనాలి... అర్థమైందా... మనం ఏదో యాత్రకి పోతున్నట్లు చెప్పాలి.."

"బాగోదు శ్యామా... ప్లీజ్ నా మాట విను... నా చిన్నప్పటి మిత్రుడు.." అని అమ్మని ఒప్పించి బయటకు చిరునవ్వును తిరిగి అతికించుకుని వెళ్ళారు నాన్న.

ఆయన వుండటం ఖాయమని తెలిసిన నా ఎద త్రుళ్ళింత లాడింది. ఆ రోజు నా చదువు సున్న. సిగిరెట్లు, కిళ్లీల కోసం నన్ను పంపిస్తూనే వున్నారు. చిల్లర తిరిగిస్తే, వద్దని నాకే తిరిగి ఇచ్చారు. అలా ఆ రోజంతా రెండు రూపాయలు దాకా సంపాయించాను. వెళ్ళేటపుడు ఎలా లేదన్నా అయిదు రూపాయలు చేతిలో పెట్టే ఉదారుడిలా కనిపించారు.

ఆయన పని ముగిసింది. వెళ్ళేటపుడు.. నన్నాయన బ్యాగు పట్టుకుని బస్టాండుకి దిగబెట్టి రమ్మన్నారు. ఉల్లాసంగా ఒప్పుకున్నాను.

ఆయన నాతో చిన్న పిల్లడిలా కలిసిపోవటం నాకెంత సంబరమయ్యిందో చెప్పలేను. బస్సు ఎక్కేదాకా ఏమీ ఇవ్వకపోతే గుండె ఝల్లుమంది. కాని రద్దీగా వున్న బస్సు ఫుట్‌బోర్డ్ మీద నిల్చుని జేబులోంచి అయిదు నోటుని తీసి అందిస్తూ.. "బాబూ... మిఠాయి కొనుక్కో.." చెప్పారు

గవాస్కర్ సెంచరీ కొట్టినపుడు కూడా అంత సంతోషం కల్గలేదు.

ఆ సాయంత్రమే మా క్రికెట్ టీమ్‌నంతటినీ ఒక చోట చేర్చి అన్ని విషయాలు మాట్లాడి బ్యాట్, బంతి క్రొత్తవి కొందామని బజారుకు వెళ్ళాం.

ఆదివారం–చీపురుపల్లి నుండి పెద్దక్క... బావ వచ్చారు. ఎపుడు వచ్చినా

నిండారా నవ్వుతూ అందరినీ పలుకరించే బావ మొహంలో ధుమధుమ... అక్క కళ్ళల్లో సన్నటి నీటితెర. అమ్మ, నాన్న బావను పల్కరిస్తూన్నా పట్టించుకోక పెద్దగా ఏదో చెబుతున్నాడు.

అక్కలో ఏవేవో తప్పులు ఎంచి చూపిస్తున్నట్లు తోచింది. మరింక తీసుకెళ్ళనని మీ దగ్గరే అట్టే పెట్టుకోండని ఇంకా ఏవేవో అంటున్నాడు.

నావంక అస్సలు చూడలేదు. చాలా బాధనిపించింది. బావను చూస్తూనే మొదట పులకించి పోయిన నేను ఆ చిటపటలు భరించలేక పోయాను. బావ ఎప్పుడు వచ్చినా నన్ను వూరంతా త్రిప్పి కూల్‌డ్రింకులు.. పళ్ళు, ఫలహారాలు ఇప్పించేవాడు... కాని ఈ రోజేంటిలా ?

నిలుచున్న పాళంగానే రుసరుసలాడుతూ వెళ్ళిపోయాడు.

నాన్న, వెనకే వెళ్ళి ఏదో అంటున్నా వినిపించుకోనట్లు రిక్షా ఎక్కాడు. పెద్దక్క బావురుమని ఏడ్చేసి అమ్మతో ఏదో అంటూంది.

నా కనులంట గిర్రున కన్నీళ్ళు...

ఆ రోజంతా చికాగ్గానే గడిచింది.

ఆ చికాకు ఉఫ్ఫున వూదినట్లు ఎగిరిపోవటానికి కారణం పోస్టులో వచ్చిన ఉత్తరం. నిన్నంతా మొహాలు మాడ్చుకున్న అమ్మ, నాన్న ఆ ఉత్తరం చదివి వుల్లాసంతో వుబ్బితబ్బిబ్బయిపోయారు.

"నే చెప్పలేదటండీ... మనమ్మాయికేం బంగారబొమ్మ.. చూసి ఐసైపోయి వుంటాడు. కట్నం కూడా పెద్ద ఎక్కువ కోరటం లేదు. అందుకే ఆడదాని అదృష్టం అంటారు"

మొహం నిండా చిందులేస్తున్న సందడి.

పెద్దక్క అడిగితే అమ్మ చెబుతూంది. చిన్నక్కకి త్వరలో పెళ్ళట.

"ముహూర్తాలు పెట్టించటానికి ఎల్లుండి వస్తారమ్మా" నాన్న అన్నారు.

అంటే ఎల్లుండి చుట్టాల్తో ఇల్లు కళకళలాడిపోతుందన్న మాట. ఆ మధ్య చిన్నక్కని చూడ్డానికి వచ్చిన వారయ్యుంటారు. అయితే పండగే.. ఈసారి మాత్రం అమ్మ కంట పడకుండా ఇస్తే బాగుణ్ణు.....!!

స్కూలు కెళ్ళినా నా ధ్యాస ఎల్లుండిపైనే..అదే సమయంలో గుండెలు దడదడలాడేలా పైడిరాజు చెప్పిన వార్త ఒకటి.

"ఒరే! ఓపెనింగ్ బ్యాటింగ్ ప్రెసిడెంట్ కొడుకు గణేశు దిగుతాట్ట. ఒప్పుకోకపోతే తంతాట్ట..."

"డక్ ఔటయ్యేవాడికి ఓపెనింగ్ బ్యాటింగా..." ఒళ్ళుమండి అన్నాను.

"ఒరే... మన గ్రౌండు బాగు చేయించాలి... డబ్బులు కలెక్టు చేయాలి. మనిషి అయిదు వేసుకుంటే చాలు..." చెప్పాడు పైడిరాజు.

సరేనన్నాను.

ఆదివారం ఉదయం పది గంటలౌతుంటే చుట్టాలు దిగారు.

అదీ యిదీ మాట్లాడాక భోజనాలు చేసి వెళ్ళమని నాన్న బలవంత పెట్టినా వినకుండా... "కలికితే అతకదు" అని కదిలారు. వారి వెంటే నాన్న బయలు దేరుతుంటే నా హృదయం చివుక్కుమంది. ఆయనొస్తే డబ్బులు హుళక్కి!!

కాని వాళ్ళు..."తామెందుకులెండి వుండిపోండి..మీ కుర్రాడ్ని పంపిస్తే చాలు" అనడం విన్న నాలో వుల్లాసం పొంగిపొరలింది.

ఆయన వద్దన్నా వినకుండా చిన్న బ్యాగ్ మోసాను. ఎండబాగా వుందని రిక్షా పిలిచారు. వారితో పాటే కూల్ డ్రింక్ ఇప్పించారు. ఓ బిస్కెట్ ప్యాకెట్ చేతిలో పెట్టారు.

"బాబూ... ఎండమండిపోతూంది... రిక్షాలో వెళ్ళు.." అని ఐదు రూపాయలు ఇచ్చారు.

నేను రిక్షా ఎక్కకుండా పిట్టలా తుర్రుమని ఇంటికి వెళ్ళాను. పది రోజులు గడిచాయి.

మా పొరుగూరు కమ్మసిగడాం తిరునాళ్ళు ఘనంగా జరుగుతాయి. ఆ ఊర్లో మా పెదనాన్న గారున్నారు. మా మిత్రులతో కలసి వెళ్ళాను. తిరునాళ్ళు ముగిసాక వెళ్ళిపోతానంటే రెండు రోజులుండమంది దొడ్డమ్మ.

ఓ రోజు తెలతెలవార్తుండగా తలుపులు దబదబలాడుతున్నాయి. అకస్మాత్తుగా మెలకువ వచ్చింది. నన్ను పెదనాన్న గబగబ తెమలమన్నారు.

"మీ ఊరెళ్ళాలి బాబూ!" అన్నారు. వారందరితో నేనూ వెళ్ళాను. మా ఊరు చేరేసరికి ఎనిమిదయింది.

ఇంటినిండా పుట్టెడు మంది. బోలెడు చుట్టాలు.. నా ఎదనిండా వెన్నెల... పెదనాన్న పెద్దక్కని పిలిచి "అమ్మా! నీతో పాటు వీడ్ని గదిలోకి తీస్కెళ్ళు..." చెప్పారు.

గదిలోకి వెళ్ళాక గడియ పెట్టేసింది. నా ఊహలు ఉల్లాసంగా సాగాయి.

"అక్కా...మన చుట్టాలేనా వారంతా..'. ఒక్కసారి అంతమందిని చూడగానే నేను ప్రశ్నించాను.

మారు మాటాడలేదు. అక్క ఇక్కడికి లాక్కుని వచ్చేసిందేమిటి? వారందరి మధ్య వుంటే ఎంత బాగుండేదో!! గడియ తీయబోతే అక్క వారించింది.

అక్క అసలెందుకు ఏడుస్తోంది. ఒకవేళ బావగాని కొట్టాడా.. మరయితే అంతమంది ఎందుకొచ్చినట్టు...లేదు... చిన్నక్క పెళ్ళని ఎలాగూ అనుకుంటున్నారు.. బహుశా అందుకే బోలెడు మంది దిగిపోయి వుంటారు...భలే!!భలే!!!

అప్పుడు తనకి బోలెడు డబ్బు!!!

మధ్యాహ్నం దాకా తలుపులు తెరవలేదు!!! అక్క నా చేయి పట్టుకుని బయటకు నడిచింది. కాని ఒక్కరంటే ఒక్కరు లేరు.

ఎవరిదో ఏడుపు మాత్రం వెక్కి వెక్కి.. మరెవరు! అమ్మే!!

ఈ వచ్చిన చుట్టాలందర్నీ అమ్మే కోప్పడి పంపేసి వుంటుంది!! పైగా ఏడుపు...!!

"అమ్మా... మీనాన్న వెళ్ళిపోయారు..." ఏడుపు మరింతగా.

అక్క చేయి మెల్లగా వదిలించుకున్నాను. చుట్టాలందర్నీ పంపించేయమని చెప్పి వుంటుంది అమ్మ... వారందర్నీ పంపించటానికి నాన్నకి ఎంత మాత్రం ఇష్టం లేక పోయినా పంపేసి వుంటారు.

అందుకే చుట్టాలు వెళ్ళిపోయి వుంటారు. అమ్మ మీద కోపం కొద్దీ నాన్న వెళ్ళిపోయి వుండాలి.

ఛ!! అమ్మెప్పుడూ యింతే!!

(మయూరి వార పత్రిక 27-8-1993)